సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



క్షుద్ర పూజలు

గుర్తు తెలియని వ్యక్తులు ఓ రైతు పొలంలో క్షుద్రపూజలు చేశారు. ఈ ఘటన చేవెళ్ల మండలంలో చోటు చేసుకుంది. 8లో▸



త్వరలో మహాలక్ష్మి పథకం

త్వరలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2,500 నగదు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. 8లో▸



పనులు పూర్తి కాకుండానే..

కొడంగల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో దుకాణాల పనులు పూర్తి చేయకుండానే టెండర్లు పిలిచారు. 9లో▸

న్యూస్‌రీల్

28న జాతీయ లోక్ అదాలత్

అనంతగిరి: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా న్యాయస్థానం ఆవరణలో పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి ఆస్కారం ఉన్న కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. రాజీ మార్గమే రాజమార్గమన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి డీబీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, అదనపు జూనియర్ జడ్జి శృతిదూత, ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, కరుణసాగర్, బాలకృష్ణారెడ్డి, సీఐలు నాగరాజు, భీంకుమార్, అశోక్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 వరకు ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు

కొడంగల్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2024–25 సంవత్సరానికి గాను డిగ్రీ ప్రథమ సంవత్సరం (బీఏ, బీకాం, బీఎస్సీ)లో చేరేందుకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఓపెన్ యూనివర్సిటీ కో ఆర్డినేటర్ రఫియాభానమ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు సైతం 30వ తేదీ లోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. 2015 – 16 విద్యా సంవత్సరం నుంచి 2023–24వరకు అడ్మిషన్ పొంది ట్యూషన్ ఫీజు చెల్లించని విద్యార్థులకు అవకాశం కల్పించామని ఆమె తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్



అబ్దుల్‌హఖ్



దినేష్‌సింగ్

కొడంగల్ రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పీఆర్‌టీయూ అగ్రస్థానంలో ఉందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కే చంద్రశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో యూనియన్ మండల శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సంఘం ముందు పీఆర్‌సీ, డీఏ, పెండింగ్ బిల్లులు, హెల్త్ కార్డులు, సీపీఎస్ రద్దు వంటి సమస్యలు ఉన్నాయని అన్నారు. వీటి పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని కలుస్తామని చెప్పారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అబ్దుల్‌హఖ్, ప్రధాన కార్యదర్శిగా దినేష్ సింగ్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.వెంకటేశం, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా రజితారెడ్డి, కార్యదర్శిగా బాస్వంత్, మహిళా కార్యదర్శిగా మహేశ్వరిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు, యూనియన్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు మహ్మద్ సులేమాన్, మహేందర్‌సింగ్, మాణిక్యం, భీమప్ప, ఎంఈఓ రాంరెడ్డి, యాదగిరి, గోపీనాథ్, వెంకటయ్య, ఏసురత్నం, చెన్నకేశయ్య, శరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రూట్లలో బస్సులు నడపాలి

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేశ్



పరిగి ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

పరిగి: పాఠశాలలు, కళాశాలల సమయంలో ఆర్టీసీ బస్సులు రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేశ్ అన్నారు. గురువారం పరిగి ఆర్టీసీ డీఎం కరుణశ్రీని కలిసి అన్ని రూట్లలో బస్సులు నడపాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చాలా రూట్లలో బస్సులు నడవకపోవడంతో విద్యార్థులు, ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. దీంతో స్కూళ్లకు ఆలస్యంగా వెళుతున్నారని తెలిపారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయి, ప్రేమ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలా!

ఉచిత బియ్యానికే పరిమితమైన చౌకధరల దుకాణాలు



రేషన్ బియ్యం తీసుకుంటున్న మహిళలు

- కమీషన్ కోసం డీలర్ల ఎదురుచూపులు
- గౌరవ వేతనం, పర్సెంటేజీ పెంచాలని విన్నపం
- ఖాళీ సంచులు అమ్మితే కడుపు నిండదని ఆవేదన



ఇవ్వాల్సిన సరుకుల జాబితా

కొడంగల్: రేషన్ దుకాణాలు ఉచిత బియ్యానికే పరిమితమయ్యాయి. వినియోగదారులకు పంపిణీ చేసిన బియ్యానికి ఇవ్వాల్సిన కమీషన్ కూడా ప్రభుత్వం ఎప్పుడో ఒకసారి చెల్లిస్తోందని డీలర్లు వాపోతున్నారు. చాలీ చాలని కమీషన్‌తో కడుపు నిండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం అమ్మిన తర్వాత మిగిలిన ఖాళీ సంచులు అమ్ముకోవాల్సి వస్తోందని అంటున్నారు. గతంలో రేషన్ దుకాణాలు అంటే ఆదాయ వనరుగా చూసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మొత్తం ఆన్‌లైన్ కావడంతోపాటు బయో మెట్రిక్ ద్వారానే సరుకులు పంపిణీ చేస్తున్నారు. దీంతో డీలర్లకు గిట్టుబాటు కాకుండా పోయింది. రేషన్ కూడా మిగలడం లేదని అంటున్నారు. గిట్టుబాటు కాకపోవడంతో డీలర్లు కష్టాల్లో పడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నెలకు రూ.5వేల గౌరవ వేతనం, రూ.300 కమీషన్ ఇవ్వాలని కోరుతున్నారు.

పని చేయని ఈ పాస్ యంత్రాలు

కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతోంది. ఈ పాస్ మిషన్లకు సిగ్నల్స్ అందకపోవడం వల్ల సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. దీంతో లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. చౌకధర దుకాణాల్లో అక్రమాలను అరికట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ (ఈ–పాస్) యంత్రాలు సాంకేతిక సమస్యల వల్ల తరచూ పని చేయడం లేదు. ఐరిష్, వేలిముద్రలు సరిగ్గా ఉంటేనే సరుకులు ఇస్తారు. ఇంటర్నెట్ సిగ్నల్స్ అందక మొరాయిస్తున్నాయి. గంటల తరబడి రేషన్ షాపుల్లో పడిగాపులు కాసినా ఫలితం లేకుండా పోతోంది. ప్రతి నెలా రేషన్ దుకాణాల్లో బియ్యం తీసుకోవాలంటే ఒకటి, రెండు రోజులు పని మానుకోవాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు.

కొడంగల్ మండలంలో..

మండలంలో 31 రేషన్ దుకాణాలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాల కంటే మారుమూల గ్రామాల్లోనే షాపులు అధికంగా ఉన్నాయి. పట్టణాల్లో సెల్‌ఫోన్ టవర్స్ ఉండడం వల్ల సమస్య లేదు. గ్రామాల్లో సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 11,500 రేషన్ కార్డులు ఉన్నాయి. పాటిమీదిపల్లి, కస్తూరుపల్లి, పెద్దనందిగామ, ఇందనూర్, చిట్లపల్లి, నాగారం తదితర గ్రామాల్లో సిగ్నల్స్ సరిగ్గా రావడం లేదని స్థానికులు అంటున్నారు. ఒకవేళ సిగ్నల్స్ వస్తే సర్వర్ డౌన్ అవుతోందని వాపోతున్నారు. దీంతో సరుకుల పంపిణీలో జాప్యం జరుగుతోంది. కూలి పనులు వదులుకొని బియ్యం కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

జిల్లాలో 593 దుకాణాలు

జిల్లాలో 593 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటిలో ఈ పాస్ యంత్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 2.09 లక్షల ఆహార భద్రత కార్డులు, 25వేల అంత్యోదయ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతి నెలా 5,200 టన్నుల బియ్యం అలాట్‌మెంట్ ఉంది. రేషన్ దుకాణాల్లో ఈ పాస్ ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నారు. అయితే అందుకు తగినట్లుగా సాంకేతిక వ్యవస్థను మెరుగు పరచకపోవడం వల్ల సమస్యలు వస్తున్నాయి.

గౌరవ వేతనం ఇవ్వాలి



రేషన్ డీలర్లకు ప్రభుత్వం నెలకు రూ.5వేల గౌరవ వేతనం ఇవ్వాలి. అలాగే బియ్యం పంపిణీ చేసినందుకు ప్రస్తుతం ఇస్తున్న కమీషన్‌ను పెంచాలి. చౌకధర దుకాణాల్లో గతం మాదిరిగా అన్ని రకాల సరుకులు ఇవ్వాలి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో పేదలకు 9 రకాల సరుకులు ఇచ్చేవారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అప్పటిలాగా 9 రకాల సరుకులు పంపిణీ చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది.

– నర్సిరెడ్డి, రేషన్ డీలర్, కొడంగల్



తాండూరు అటవీ ప్రాంతంలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలి

ఫారెస్ట్ కన్జర్వేటర్ రాంబాబు

తాండూరు: అన్యాక్రాంతమైన అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆ శాఖ చార్మినార్ సర్కిల్ కన్జర్వేటర్ ఎస్ రాంబాబు ఆదేశించారు. గురువారం తాండూరు పరిధిలోని అటవీ ప్రాంతాన్ని జిల్లా అధికారి జ్ఞానేశ్వర్‌తో కలిసి సందర్శించారు. పట్టణ శివారులోని అంతారం గొట్లపల్లి అటవీ భూమిలో గల అర్బన్ పార్కును పరిశీలించారు. పార్కు నిర్వహణ సరిగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నగర వన యోజన ద్వారా తాండూరు, వికారాబాద్, కొడంగల్, పరిగి ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లాలో అటవీ భూములు అన్యాక్రాంతంపై ఆరా తీశారు.

విద్యుత్ లైన్ పనులు నిలిపేయండి

కలెక్టర్ శశాంకకు పోమాల్‌పల్లి గ్రామస్తుల వినతి



కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లిలో హైటెన్షన్(765 కేవీ) విద్యుత్ లైన్ పనులను నిలిపివేయాలని గురువారం గ్రామస్తులు రంగారెడ్డి కలెక్టర్ శశాంకను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మహేశ్వరం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటుకు గతంలో మార్కింగ్ ఇచ్చారని.. ఈ మార్కింగ్‌ను మార్చుతూ.. గ్రామ సమీపంలోని ఇళ్లకు వంద మీటర్ల దూరం నుంచే వేయడంతో గ్రామంలోని పురాతన దేవాలయానికి అడ్డుగా ఉంటున్నాయన్నారు. ఇదే విషయమై పవర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ వారికి సైతం వినతిపత్రం అందజేశామన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య, రమేష్, భూపాల్‌రెడ్డి, అంజయ్య, ముత్యాల్‌రెడ్డి, శ్రీనివాసులు, పూజారి రవిశర్మ, నర్సింలు, మస్తాన్, రాఘవేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ రేణుకాదేవి

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

మోమిన్‌పేట: క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం మోమిన్‌పేట జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్‌ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరం అన్నారు. ఏదైనా ఓ క్రీడను ఎంచుకొని రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఉన్నత చదువుల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు లభిస్తాయని చెప్పారు. అంతేకాకుండా మానసికోల్లాసం, శారీరక దృఢత్వం, చదువుపై ఏకాగ్రత పెంచుకోవచ్చని పేర్కొన్నారు. మండల, జిల్లా స్థాయి పోటీల్లో రాణిస్తే రాష్ట్ర స్థాయికి ఎంపికవుతారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక పాఠశాలలో ప్రవేశం కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంఓ రాంమస్తాన, ఎంఈఓ గోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, ఎంఎన్‌ఓ మల్లేశం, క్లస్టర్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా బోధన జరగాలి

మర్పల్లి: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన జరగాలని డీఈఓ రేణుకాదేవి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంగ్లిష్ శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించేలా బోధన జరగాలన్నారు. అనంతరం కస్తూర్బా బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో నెల కొన్న సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి విద్యాసాగర్, రిసోర్స్ పర్సన్స్ రవి, పవన్‌కుమార్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సంరక్షకులను తీర్చిదిద్దాలి

పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సైతం భాగస్వాములు అవ్వాలని పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ – తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ లీడర్స్' మూడవ బ్యాచ్ ఓరియెంటేషన్ గురువారం ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమానికి కరీంనగర్, నల్గొండ, కామారెడ్డి జిల్లాలకు చెందిన 60 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ చైర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సాయి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన పెంచి ప్రకృతి సంరక్షకులుగా తీర్చిదిద్దాలని సూచించారు. నేల వ్యవసాయం, ప్రకృతి మధ్య అవినాభావ సంబంధాన్ని వివరిస్తూ.. విద్యార్థులకు వ్యవసాయ పరిజ్ఞానం పెంచాలన్నారు. కాలుష్య నియంత్రణకు బయో ఇంధనాల వాడకం, వృక్ష సంరక్షణ, నేల, జల సంరక్షణ, తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అధికారి అనుదీప్, ప్రోగ్రాం ఆఫీసర్స్ నగేశ్, రజనీకాంత్ సీజీఆర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఫ్యూచర్‌కు 300 అడుగులు

హైదరాబాద్ అభివృద్ధికి ఫ్యూచర్ సిటీ కీలకంగా మారుతుందని విశ్వసిస్తున్న ప్రభుత్వం ఆ దిశగా పనుల్లో వేగం పెంచింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఆమనగల్లు వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మించేందుకు కసరత్తు చేస్తోంది.

- రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు
- ఓఆర్ఆర్ నుంచి ఆమనగల్లు వరకు 40 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ రహదారి



కందుకూరు: ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఓఆర్ఆర్ నుంచి నేరుగా 300 అడుగుల విస్తీర్ణంలో గ్రీన్ ఫీల్డ్ రహదారి చేపట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగా ఇప్పటికే అధికారులు రెవెన్యూ వారీగా సర్వే పనులు పూర్తి చేసినట్లు సమాచారం. దీంతో ఈ ప్రాంతానికి కనెక్టివిటీ మరింత పెరుగనుంది.

టీజీఐఐసీ, అటవీ భూముల మీదుగా..

కందుకూరు మండలం బేగరికంచె, మీర్‌ఖాన్‌పేట, పంజగూడ, ముచ్చర్ల, యాచారం మండలం కుర్మిద్ద, మేడిపల్లి తదితర గ్రామాల్లో గత ప్రభుత్వం ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ప్రస్తుత ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మించేందుకు యోచిస్తున్న విషయం విధితమే. కాగా ప్రస్తుతం ఓఆర్ఆర్ కొంగరకలాన్ ఎగ్జిట్ నంబర్–13 నుంచి నేరుగా బేగరికంచె పంచాయతీ వావిళ్లకుంటతండా వరకు.. అక్కడి నుంచి ఆమనగల్లు వరకు దాదాపుగా 40 కిలోమీటర్ల మేర 300 అడుగుల విస్తీర్ణంలో రహదారి నిర్మాణం చేపట్టనుంది. ఇందుకు సంబంధించి ఇటీవల సర్వే పనులు దాదాపు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. మూడు విధాలుగా సర్వే చేసిన అధికారులు చివరకు 300 అడుగుల విస్తీర్ణం రహదారికి ఓకే చెప్పినట్లు తెలిసింది. ఈ రహదారి నిర్మాణానికి దాదాపుగా 900 ఎకరాలకు పైగా భూసేకరణ చేపట్టాల్సి ఉంది. కొంగర, పిరోజ్‌గూడ, లేమూరు, తిమ్మాపూర్, రాచులూరు, గుమ్మడవెల్లి, పంజగూడ, మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల, కుర్మిద్ద, కడ్తాల్, ముద్విన్, ఆకుతోటపల్లి, ఆమనగల్లు రెవెన్యూలో దాదాపుగా 900 ఎకరాలకు పైగా భూమిని సేకరించనున్నారు. వాటిలో టీజీఐఐసీ భూములు, మధ్యలో అటవీ భూములున్నాయి.

ఫ్యూచర్ సిటీకి నేరుగా..

కొంగర కలాన్ ఎగ్జిట్ నంబర్–13 నుంచి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ రహదారిని కలుపుకొంటూ అగర్ మియాగూడకు తూర్పుగా రోడ్డు ప్రారంభమవుతుంది. లేమూరు రెవెన్యూ నుంచి రాచులూరు హనుమాన్ దేవాలయం మీదుగా గాజులబురుజుతండాకు పడమర నుంచి గుమ్మడవెల్లి అటవీ భూములకు వెళ్తుంది. అక్కడ నుంచి పంజగూడ, మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ మీదుగా వావిళ్లకుంటతండా పెద్దమ్మ దేవాలయం వరకు నిర్మించిన ఫార్మా రహదారి వరకు 300 అడుగుల రహదారి నిర్మించనున్నారు. సార్లరావుపల్లికి తూర్పుగా కుర్మిద్ద, ముచ్చర్ల గ్రామాల మధ్యగా కడ్తాల్, ముద్విన్, ఆకుతోటపల్లి మీదుగా ఆమనగల్లు వరకు దాదాపుగా 40 కిలోమీటర్ల మేర రహదారి నిర్మించడానికి అధికారులు ప్రణాళికలు రచించి సర్వే సిద్ధం చేశారు. అధికారికంగా ప్రకటించడమే ఆలస్యం. దీంతో హైదరాబాద్‌తో పాటు అటు బెంగళూరు, ఇటు సాగర్, విజయవాడ ప్రధాన రహదారుల నుంచి ఫ్యూచర్ సిటీలోకి నేరుగా రాకపోకలు సాగించడం సులభవుతుంది.

క్లుప్తంగా

నేడు మోమిన్‌పేటకు స్పీకర్

మోమిన్‌పేట: రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శుక్రవారం మోమిన్‌పేటకు రానున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ మేరకు రూ.500లకే వంట గ్యాస్‌ను అమలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందించనున్నట్లు వివరించారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

లింగన్నపల్లిలో డెంగీ కలకలం



డెంగీకి గురైన ఇంటి సభ్యులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

కుల్కచర్ల: దోమలతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపిస్తాయని హెల్త్ అసిస్టెంట్ శరభలింగం అన్నారు. గురువారం చౌడాపూర్ మండలం లింగన్నపల్లి గ్రామ పంచాయతీలో నక్కపల్లి కృష్ణయ్య డెంగీ బారిన పడ్డారు. ఈ విషయాన్ని గ్రహించిన వైద్యాధికారులు గురువారం గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ వ్యక్తిగత ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్క కుటుంబం తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'వివాదాస్పద స్థలం సర్వే నంబర్ 51లోనే ఉంది'




విలేకరులతో మాట్లాడుతున్న గోపాల్

తాండూరు: వివాదాస్పద స్థలం సర్వే నంబర్ 51లోనే ఉందని తాండూరుకు చెందిన న్యాయవాది గోపాల్ అన్నారు. గురువారం ఆయన మాజీ కౌన్సిలర్ ఇర్ఫాన్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డుపై 760 చదరపు గజాల్లో ఉన్న స్థలం విషయంలో కొంత కాలంగా ఇరు వర్గాల మధ్య వివాదం నడుస్తోందన్నారు. వాస్తవానికి ఈ భూమి సర్వే నంబర్ 51లోనే ఉందని రెవెన్యూ అధికారులు సర్వే చేసి ధ్రువీకరించారన్నారు. అయితే సర్వే నంబర్ 5లో ఈ స్థలం ఉందంటూ వ్యాపారి కట్కం వీరేందర్ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సదరు భూమి ఏ సర్వే నంబర్‌లో ఉందనే అంశాన్ని కోర్టు తేలుస్తుందన్నారు. ఏదైనా న్యాయపరంగా ముందుకు వెళ్లాలని సూచించారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ అన్నారు. గురువారం శుభ్రతపై పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కృష్ణవేణి పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొడంగల్ పురపాలిక ఆధ్వర్యంలో స్వచ్ఛతా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇళ్లలో తడి పొడి చెత్తకు వేర్వేరు బుట్టలను వాడాలన్నారు. కంపోస్టు తయారు చేయడంపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రత పాటించకపోతే వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఆహార పదార్థాలను నిల్వ ఉంచరాదన్నారు. తినుబండారాలను ఎప్పటికప్పుడు తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో చోరీ

పెద్దేముల్: ఫాంహౌస్‌లో చోరీ జరిగిన సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. నెల వ్యవధిలోనే రెండుసార్లు ఫాంహౌస్‌లో దొంగతనం జరగడంపై నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మంబాపూర్–రెంగోడి గ్రామ శివారులోని జీవరత్నంకు చెందిన ఫాంహౌస్ ఉంది. ఇందులో మామిడి తోటతో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్నాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 6 హెచ్‌పీ మోటారుతో పాటు స్టార్టర్ ఇతర వస్తువులు సుమారు రూ.45 వేల విలువైన సామగ్రిని దొంగతనం చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నెల రోజుల క్రితం అదే ఫాంహౌస్‌లో 5హెచ్‌పీ మోటారు, 350 మీటర్ల కేబుల్‌వైర్‌తో పాటు పలు సామగ్రిని అపహరించారు. ఈ మేరకు దుండగులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరారు.


బొప్పాయిలో మెలకువలే ముఖ్యం



వెర్రి తెగులు సోకిన బొప్పాయి మొక్క



ఆకు ముడత సోకిన బొప్పాయి



ఉంగరాల తెగులు సోకిన బొప్పాయి కాయ

- అన్నదాతలను వేధిస్తున్న తెగుళ్లు
- యాజమాన్య పద్ధతులతోనే నివారణ
- రైతులకు క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ సూచనలు



జి.శ్రీకృష్ణ, కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు

కందుకూరు: బొప్పాయి పంటకు వైరస్ తెగుళ్లు ఆశించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం పెట్టుబడులు సైతం రాని దుస్థితి దాపురిస్తుంది. తెగుళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను గురించి కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ అన్నదాతలకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుమారు ఆరు వేలకు పైగా ఎకరాల్లో బొప్పాయిని సాగు చేస్తున్నారు.

పండు నాణ్యతకు దెబ్బ

మొజాయిక్, రింగ్‌స్పాట్(ఉంగరాల) తెగులు, ఆకు ముడత(క్రింకిల్) అనే మూడు రకాల వెర్రి తెగుళ్లు బొప్పాయి పంటను ఆశించి దిగుబడులను గణనీయంగా తగ్గిస్తుంది. పండు నాణ్యతను దెబ్బతీసి నష్టాన్ని కలిగించడంతో పాటు కొన్ని సందర్భాల్లో చెట్లు కాపునకు రాకుండా చేస్తుంది. ఈ మహమ్మారిని తొలి దశ నుంచే యాజమాన్య పద్ధతులతో అరికట్టాలి. వెర్రి తెగులు వైరస్ ఒకసారి ప్రవేశిస్తే మొక్క క్షీణించే వరకు దాని జీవకణాలలోనే ఉండి రకరకాలుగా అవరోధాలను కలిగించి అనర్థాలకు దారితీస్తుంది.

మొజాయిక్ తెగులు

మొజాయిక్ తెగులు ఆశిస్తే ఆకు సైజు తగ్గుతుంది. ఆకులపై అక్కడక్కడ పసుపు రంగు మచ్చలు ఈనెలతో నిమిత్తం లేకుండా ఏర్పడతాయి. దూరం నుంచి ఆకులు పసుపు రంగుకు మారినట్లు కన్పిస్తాయి. అందుకే దీనిని పల్లాకు తెగులని అంటారు. తెగులు సోకిన ఆకులు పెళుసుగా మారతాయి. చెట్ల పెరుగుదల తగ్గి ఎదుగుదల అంతగా ఉండదు. పంట దిగుబడి నాణ్యత గణనీయంగా తగ్గుతుంది. కాయలు గిడసబారి నాసిరకంగా ఉంటాయి. విత్తనం, పేనుబంక ద్వారా తెగులు వ్యాపిస్తుంది.

ఉంగరాల(రింగ్‌స్పాట్) తెగులు

ఈ తెగులు లక్షణాలు ఆకులు, కాడ, కాండం, పూత, పిందె, కాయ, పండ్లపై ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. లేత ఆకులు పచ్చదనం కోల్పోయి పసుపు పచ్చగా మారతాయి. ఆకుల ఈనెలు వంగి ముడుచుకుపోతాయి. దీంతో ఆకుల పరిమాణం తగ్గి సరైన మోతాదులో ఆహారాన్ని తయారు చేసుకోలేవు. కాండం పైభాగాన ఆకు తొడిమలపై ముదురాకు పచ్చని మచ్చలు, చారలు నూనె రాసినట్లు కన్పిస్తాయి. తెగులు సోకిన చెట్టు పూలు అంతగా పిందె కట్టవు. పిందెలు ఎదగవు. రింగులున్న కాయలు తొందరగా పండి మెత్తబడి నీరుకారుతాయి. నాణ్యత బాగా లోపిస్తుంది.

ఆకుముడత (లీఫ్ క్రింకిల్) తెగులు

ఈ తెగులు సోకిన చెట్లలో ఎదుగుదల తగ్గుతుంది. ఆకులు ముడుచుకుని బంతిలాగా మారతాయి. ఆకు తొడిమ వంకర టింకరగా తిరుగుతుంది. వికృతాకారంగా ఉంటుంది. చెట్టు తల ఆకారం మారుతుంది. పూత రాక గొడ్డు చెట్టుగా మారవచ్చు. తెల్లదోమ ద్వారా తెగులు వ్యాప్తి చెందుతుంది.

వెర్రి తెగులు నివారణ యాజమాన్యం

- ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలు వాడాలి.
- విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి.
- నారు మొక్కలు ప్రధాన పొలంలో నాటేటప్పుడు వెర్రి తెగుళ్ల లక్షణాలు గల వాటిని నాటరాదు.
- అంతర పంటగా మిరప, టమాటా, దోస, పుచ్చ, గుమ్మడి లాంటివి సాగుచేయరాదు.
- తెగులు సోకిన మొక్కలను గమనించిన వెంటనే తీసి నాశనం చేయాలి.
- సమతుల సమగ్రమైన ఎరువులను సకాలంలో అందించాలి.
- సూక్ష్మధాతు మిశ్రమాన్ని 3, 4 నెలల వయసులో ఒకసారి చెట్లపై పిచికారీ చేయాలి.
- కలుపు మొక్కలు పొలంలోను, పొలం గట్ల పైన లేకుండా పరిశుభ్రతను పాటించాలి.
- తోటలో నీరు నిల్వకుండా జాగ్రత్త పడాలి.
- అంతర సేద్యం చేసేటప్పుడు చెట్ల వేర్లకు గాయాలు తగలకుండా చూడాలి.
- రసం పీల్చే పురుగులతోనే వైరస్ తెగుళ్ల వ్యాప్తి చెందుతాయి. పేనుబంక, తెల్లదోమ పురుగులను సకాలంలో నివారించాలి. వాటి నిర్మూలనకు థైయోమిథాక్సిన్ 0.3 గ్రా, లేదా డైఫెన్‌థ్యూరియాన్ 1 గ్రా, లేదా స్పినోస్యాడ్ 0.3 మి.లీ లేదా ఎసిఫెట్ 1.5 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. వాటితో పాటు 5 మి.లీ వేప నూనె లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- 15 రోజుల వ్యవధిలో పై మందులను రెండు, మూడు సార్లు పిచికారీ చేసుకుంటే పురుగు ఉధృతి తగ్గుతుంది.

నిమజ్జన సామగ్రి కోసం వెళ్లి

కొంపల్లి చెరువులో పడి వ్యక్తి మృతి

అనంతగిరి: వినాయకులను నిమజ్జనం చేసిన అనంతరం ఇనుప చువ్వలను తీసుకోవడానికి వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందిన సంఘటన మున్సిపల్ పరిధిలోని కొంపల్లి చెరువులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మోమిన్‌పేట మండలం దుర్గంచెర్వుకు చెందిన పెద్ద గొల్ల అనంతయ్య(42) కొంతకాలంగా వికారాబాద్ పట్టణంలోని కొత్త గడిలో స్థిరపడి భార్యాపిల్లలతో కలిసి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా మంగళవారం రాత్రి కొంపల్లి చెరువులో పలు వినాయకులను నిమజ్జనం చేశారు. బుధవారం ఆ విగ్రహాల సామగ్రిని తీసే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు నీట మునిగి ఆయన మృతి చెందాడు. కాగా గురువారం అటుగా వెళ్తున్న వారు చెరువులో ఉన్న మృతదేహాన్ని గమనించి విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

25 లోగా దరఖాస్తు చేసుకోవాలి

అనంతగిరి: అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా అక్టోబర్ ఒకటిన ప్రభుత్వం విశిష్ట సేవలు అందిస్తున్న వయోవృద్ధులు, సంస్థలకు పురస్కారాలు అందజేయనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వయోవృద్ధులు, సంస్థలు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5గంటలలోపు హైదరాబాద్ మలకోపేటలోని దివ్యాంగుల సంక్షేమ శాఖ భవన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



తహసీల్దార్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

రైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారంటూ కేవీపీఎస్ నాయకుల ఆందోళన

యాలాల: పనుల నిమిత్తం తహసీల్ కార్యాలయానికి వచ్చే రైతుల పట్ల తహసీల్దార్ అంజయ్య దురుసుగా ప్రవర్తిస్తున్నాడని కేవీపీఎస్ జిల్లా నాయకుడు మల్కయ్య ఆరోపించారు. ఈ మేరకు తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట పలువురు రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలు, విరాసత్, మ్యూటేషన్లు ఆన్‌లైన్‌లో కట్టుకొని కార్యాలయానికి వచ్చే రైతుల పట్ల తహసీల్దార్ చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. ఇవన్నీ సమస్యలు పట్టించుకోకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారుల కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. రైతుల సమస్యల విషయంలో తహసీల్దార్ పొంతన లేని కారణాలతో కార్యాలయం చుట్టూ తిప్పుకొని, అదే పనులను రియల్ ఎస్టేట్ వ్యాపారులు వస్తే క్షణాల్లో పూర్తి చేస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న తహసీల్దార్‌పై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ, నర్సింహులు, శ్రీనివాస్, రవి, నారప్ప, యాదప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాబితాలో అభ్యంతరాలుంటే చెప్పండి

దౌల్తాబాద్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 21వరకు పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు సమర్పించాలని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. అభ్యంతరాలను పరిశీలించి ఈనెల 26లోగా పరిష్కరిస్తామన్నారు. తుది జాబితాను ఈనెల 28న గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రచురిస్తామని వెల్లడించారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి నమోదు చేసుకునేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, డీటీ శివకుమార్, నాయకులు వెంకట్రావు, వీరన్న, మహిపాల్‌రెడ్డి, భీములు తదితరులున్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

రచ్చకెక్కిన పంతుళ్ల పంచాయితీ

కుల్కచర్ల: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాల్సిన ఉపాధ్యాయులు వారిలో వారే వ్యక్తిగత దూషణలు చేసుకుంటూ సోషల్ మీడియాలో వైరల్ చేసుకున్న ఘటన చౌడాపూర్ మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో 200మంది విద్యార్థులతో బాలుర ఆశ్రమ పాఠశాల కొనసాగుతుంది. దానికి వార్డెన్‌గా ఉన్న బాలచందర్ మాతృవియోగం చెందడంతో విధులకు దూరంగా ఉన్నారు. ఈ క్రమంలో వార్డెన్ లేని సందర్భంలో ఉపాధ్యాయులు పరస్పరం దూషించుకోవడం, విధులకు హాజరుకాకున్నా హాజరు వేసుకోవడం, పాఠాలు చెప్పకుండా గదిలో పడుకోవడం, ఉపాధ్యాయురాలి విధుల నిర్వహణపై ఇబ్బందికర చర్చలు చేయడం వంటివి పలు వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విద్యార్థులకు మెరుగైన బోధన చేయాల్సిన పంతుళ్లు ఇలా తమలోని క్రమశిక్షణా రాహిత్యాన్ని బయట పెట్టుకోవడం ఏంటని ప్రజానీకం అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో పడుకున్నారని వివరణ కోరగా అనారోగ్య సమస్య కారణమని బదులిచ్చారన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పూల తోటలో క్షుద్ర పూజలు

భయాందోళనలో బాధిత రైతులు



పొలంలో పూజలు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న పోలీసులు

చేవెళ్ల: గుర్తు తెలియని వ్యక్తులు ఓ రైతు పంట పొలంలో క్షుద్రపూజలు చేశారు. ఈ సంఘటన చేవెళ్ల మండలంలోని అంతారంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఆవుల అనంతయ్య చామంతి పూలు సాగు చేస్తున్నాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలంలోని పలు పూల మొక్కలను తొలగించి, క్షుద్రపూజలు చేసినట్లుగా గుర్తించాడు. ఓ ప్లేట్‌లో కుంకుమ, పసుపు కలిపిన అన్నం, పిండితో చేసిన బొమ్మ కనిపించాయి. దీంతో హడలిపోయిన బాధితుడు డయల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షుద్రపూజ కోసం వినియోగించిన వస్తువులను తొలగించారు. ఇలాంటి మూఢ విశ్వాసాలను నమ్మొద్దని తెలిపారు. అయితే పంట నష్టం చేయటం సరైనది కాదన్నారు. ఇదిలా ఉండగా తనకు దాయాదులకు భూవివాదం ఉందని, వారే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని అనంతయ్య ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

త్వరలో మహాలక్ష్మి పథకం

- మహిళలకు రూ.2,500 అందజేయనున్న ప్రభుత్వం
- ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



బషీరాబాద్: మహిళలకు గ్యాస్ సబ్సిడీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్: అతి త్వరలో మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం ఆడపడుచులకు ప్రతి నెలా రూ.2,500 నగదు అందజేయనున్నట్లు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు పథకాలు అమలు చేశామని అన్నారు. గురువారం బషీరాబాద్‌లో వంట గ్యాస్ లబ్ధిదారులకు రూ.500 సబ్సిడీ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉన్నా పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేసిందని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళా పక్షపాతి అన్నారు. ప్రతి పథకం వారి పేరిటే అమలు చేస్తున్నారని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.2 లక్షల రుణ మాఫీ అమలు చేసినట్లు చెప్పారు. ప్రజలకు ఇంత చేస్తున్నా బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నావంద్గీ సొసైటీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, చందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కలాల్ నర్సింహులు గౌడ్, సీనియర్ నాయకులు వెంకటేష్ మహారాజ్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాముడునాయక్, శంకరప్ప, ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన్ కేంద్రం ఏర్పాటు

యాలాల: రైతు సమస్యల పరిష్కారంలో భాగంగా మండల కేంద్రంలో కృషి విజ్ఞాన్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. యాలాలలో మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 సబ్సిడీ గుర్తింపు పత్రాల పంపిణీలో పాల్గొన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, నాయకులు భీమప్ప, పురుషోత్తంరావు, శ్రీనివాస్, అక్బర్‌బాబా, మల్లయ్య, వీరేశం, చంద్రశేఖర్‌గౌడ్, రాంచందర్ తదితరులున్నారు.

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

యాచారం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని యాచారం పోలీసులు పట్టుకున్నారు. కడ్తాల్ మండల పరిధిలోని పల్లెచల్క తండాకు చెందిన ఇస్లావత్ రమేష్ గురువారం మధ్యాహ్నం గునుగల్ గేట్ నుంచి యాచారం వైపు మారుతీ వ్యాన్‌లో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. సమాచారం మేరకు గునుగల్ గేట్ వద్ద పోలీసులు మారుతీ వ్యాన్‌ను తనిఖీ చేసి రేషన్ బియ్యాన్ని పట్టుకుని ఠాణాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు బస్సుల్లో సెల్‌ఫోన్ల చోరీ

చేవెళ్ల: వేర్వేరు బస్సుల్లో ప్రయాణం చేస్తున్న ప్రయాణికుల వద్ద నుంచి సెల్‌ఫోన్‌లు చోరీకి గురైన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల బస్‌స్టేషన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న తాండూరు డిపో బస్‌లో ఉపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి జేబులో నుంచి సెల్‌ఫోన్ చోరీకి గురైంది. మరో ఘటనలో చేవెళ్ల నుంచి పరిగి వైపు వెళ్తున్న బస్సులో షాదన్‌గర్‌కు చెందిన వెంకటేశ్ తన ఫ్యామిలీతో వెళ్తుండగా సెల్‌ఫోన్‌ని అపహరించారు. ఇరువురి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శంషాబాద్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని కొత్వాల్‌గూడలోని హిమాయత్‌సాగర్ చెరువు ఒడ్డున నీళ్లలో మృతదేహం (40) తేలియాడుతుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు ప్యాంటు, నలుపు రంగు టీషర్టు ఉన్నాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రో అకౌంట్ హ్యాక్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ఎల్‌అండ్‌టీ మెట్రో రైల్ అధికారిక ఎక్స్ అకౌంట్ గురువారం హ్యాక్ అయింది, దీంతో ఎల్‌అండ్‌టీ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. తమ సంస్థ పేరిట వచ్చే నోటిఫికేషన్‌లు, లింక్‌లను క్లిక్ చేయరాదని ప్రయాణికులను, సాధారణ ప్రజలను కోరుతూ విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎక్స్ అకౌంట్‌ను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు.

రోడ్డుపై గుంత.. వెళ్లాలంటే చింత!



ధారూరు సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంత

ధారూరు: హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న కోట్‌పల్లి ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారింది. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో నిత్యం వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా మండల పరిధిలోని హరిదాస్‌పల్లి బస్టాప్ సమీపంలో రహదారి గుంతలమయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సైతం సంభవిస్తున్న ఉదంతాలున్నాయి. గుంతలను దాటేసే సమయంలో కుడివైపు నుంచి వెళుతూ ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొంటున్నారు. అక్కడక్కడ కంకర తేలి అధ్వానంగా మారింది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేయాలని స్థానికులు, పర్యాటకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫార్మసిస్టు నియామకంపై వివాదం

విచారణ చేపట్టిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్



మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడి వివరాలు సేకరిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

బంట్వారం: స్థానిక పీహెచ్‌సీలో శాశ్వత ఫార్మసిస్టు నియామకంపై వివాదం నెలకొంది. ఇక్కడ 2017 నుంచి కాంట్రాక్టు ఫార్మసిస్టుగా అమరేందర్ విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆయన స్థానంలో వైద్యారోగ్య శాఖ శాశ్వత ఫార్మసిస్టుగా మల్లయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఆయన విధుల్లో సైతం చేరారు. దీనిపై స్థానికుల నుంచి పలు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమరేందర్‌నే ఫార్మసిస్టుగా కొనసాగించాలని మెడికల్ అధికారికి వినతిపత్రాలు అందజేశారు. ఈ క్రమంలో గురువారం పీహెచ్‌సీలో నూతన ఫార్మసిస్టు విధుల్లో చేరారనే సమాచారంతో స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్ ఆస్పత్రికి చేరుకొని విచారణ చేపట్టారు. మెడికల్ అధికారి మానసతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం అక్కడి చేరుకున్న స్థానికులతో మాట్లాడి సమస్యపై ఆరా తీశారు. పూర్తి నివేదికను సిద్ధం చేసి డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్‌ను అందజేస్తానని తెలిపారు.

వివాదాస్పద భూమిలో సర్వే

కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, ఫారెస్టు అధికారుల పరిశీలన



భూములు పరిశీలిస్తున్న తహసీల్దార్, ఫారెస్టు సెక్షన్ అధికారి తదితరులు

మర్పల్లి: మండల పరిధిలోని కల్‌ఖోడ, దామస్తాపూర్ గ్రామాల్లో రైతులు, ఫారెస్టు అధికారులకు నెలకొన్న భూముల వివాదంలో జిల్లా కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సంబంధిత భూములను సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు గురువారం తహసీల్దార్ మునీరుద్దీన్, అటవీ సెక్షన్ అధికారి కిషన్‌నాయక్ సర్వే చేపట్టారు. పూర్తి నివేదికను సిద్ధం చేసి కోర్టులో సమర్పిస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న బాధిత రైతులు.. ఈ భూములనే నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నామని, తమకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను వేడుకున్నారు.

అసలు వివాదమేంటి?

కల్‌ఖోడ ఫారెస్టుకు సమీపంలోని సర్వే నంబర్ 199, 200లలో సుమారు 25 మంది రైతులకు రెవెన్యూ అధికారులు 50 ఎకరాలకు పైగా గతంలో అసైన్డ్ పట్టాలు ఇచ్చారు. వాటిలో సాగు చేసుకుంటూ జీవనం సైతం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఫారెస్టుకు సమీపంలో రైతులు సాగు చేసుకుంటున్న భూములు తమవేనని అటవీ అధికారులు రెండేళ్ల క్రితం చెట్లు నాటారు. దీంతో అసైన్డ్ పట్టాలు పొందిన రైతులు కోర్టును ఆశ్రయించడంతో జడ్జి ఆదేశాల మేరకు అధికారులు ఫారెస్టు భూములను పరిశీలించారు.